పాంథుడు

గంట కొట్టాడు ఆఫీసరు.

జవాను పరదా తొలగించుకుని చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"సెక్రెటరీని పిలు."

"తమకోసం ఒక అబ్బాయి నిలబడ్డాడండి." వెళ్లుతూ ఈమాట చెప్పి ఆగాడు జవాను.

"రమ్మను" అన్నాడు కళ్లద్దాలు తీసి తుడిచి మళ్లీ పెట్టుకుంటూ. తలుపు వైపు చూస్తున్నాడు ఎవరయిఉంటారా అనుకుంటూ బొమలు ముడిచి.

కాలేజి విద్యార్థి మాదిరిగా ఉన్నాడు. ఛామనఛాయ. కొంచెం పొడుగు. మెల్లగా అడుగులు వేసుకుంటూ లోపలికి వచ్చి నిలబడ్డాడు.

ఆఫీసరు ఏం పని అన్నట్టు చూపి కూర్చోమని చేతిసైగ చేశాడు.

"నా పేరు బాలకృష్ణ. బి.ఏ. ప్యాసయ్యాను. తమ దగ్గర అటెండర్ పోస్టు ఖాళీగా ఉందని తెలిసి వచ్చానండి" కూర్చోకుండానే చేతులు జోడించాడు.

కనుబొమలు ముడిచాడు ఆఫీసరు.

"అటువంటి పోస్టు ఈ ఆఫీసులో లేదే? ఎవరు చెప్పారు?"

ఏ పేరు చెబితే ఏం ప్రమాదమోనని సందేహించాడు ఆఫీసరువంక చూస్తూ బాలకృష్ణ.

"చూడు. ఉద్యోగాలున్నాయంటూ ఎవరో ఏదో చెప్పి మీవంటి విద్యార్థులను భ్రమలో పడేస్తారు. బి. ఏ. ప్యాసయినవాడివి ఎటెండరు ఉద్యోగానికి వచ్చావా? హాయిగా చదువుకోవలసిన ఈడు నీది. పోటీ పరీక్షలున్నాయి. వాటికి

ప్రయత్నం చెయ్యకూడదూ? పోసీ లా చదవకూడదూ? లేకపోతే ఏదయినా చిన్న వ్యాపారం చెయ్యకూడదూ?" సలహాలు ఇచ్చాడు శ్రేయోభిలాషిగా.

"ఇకముందు చదువుకు స్తోమతు లేదండీ. ప్రాణాలు బిగబట్టుకుని ఇంత వరకూ ఈడ్చుకొచ్చాను. కడుపుకు తిండిలేక, కట్టుగుడ్డలేక- వీధి దీపాల దగ్గర చదివిన చదువిది. తమరు నా పరిస్థితి చూసైనా...."

"అబ్బాయీ. అందరి పరిస్థితులూ ఇలాగే ఉన్నాయి. నీ ఎడ్రసు ఇచ్చివెళ్లు. ఏదయినా అవకాశముంటే చూస్తాను" ఫైలుకట్ట ముడివిప్పాడు.

తలవంచి మరొకసారి నమస్కరిస్తూ వెళ్లిపోయాడతడు. గదిలోకి వచ్చే టప్పుడు అతడి ముఖంలో ఆశ. ఆందోళన. తిరిగి వెళ్లేటప్పుడు నిరాశ- నిస్పృహ- దైన్యము- ఈడుపుకాళ్లు

ఇంటికి వెళ్లేసరికి తల్లి ఎదురుగా వచ్చింది. అతడు ముఖం పక్కకు తిప్పు కుని దుమ్ముకొట్టుకుపోయిన చెప్పులు ఒక మూలన విడిచేనెపమ్మీద తలుపుదగ్గ రగా వెళ్లాడు.

"బాలూ, కాళ్లు కడుక్కురా. ఈ రాగులగంజి తాగి కాసేపు మంచమ్మీద కూర్చో" కమలమ్మ గ్లాసు పట్టుకు నిలబడ్డది.

అతడు రాగానే గ్లాసు చేతికిచ్చి "వాసు నీకోసం వచ్చాడు. రమ్మన్నా వటగా?" అన్నది.

సాయంత్రము నాలుగు గంటలు దాటుతున్నది బాలు ఉదయం తల్లిపెట్టిన పట్టెడు చద్దన్నం ఆవకాయ ముక్కతో తినివెళ్లాడు. లాండ్రీ షాపునుంచి అద్దెకు తీసుకున్న బట్టలు వేసుకుని పాతచెప్పులు లిడ్‌కాప్‌లో కొనుక్కుని ఫలానా ఆఫీ సులో అటెండర్ పోస్టు ఉన్నదని ఆ ఆఫీసు క్లార్కు రెండు రూపాయలు తీసు కుని చెబితే వెళ్లాడు. తీరా వెళ్లితే ఆఫీసరు లేదు పొమ్మన్నాడు.

గ్లాసు కిందబెట్టిన తరువాత "ఏమయింది బాబూ?" అడిగింది కమలమ్మ.

చెప్పాడు.

ఆమె కళ్లల్లో నీటిపొర కమ్ముంది. కళ్లు కొంగుతో అద్దుకుని కళ్లనిండా బాలూని చూసింది. అతడు బాలూ కాదు- బాలకృష్ణ. తన అమ్మమ్మ పెట్టిందా పేరు నిస్తేజంగా ఉన్న ఆ యింట్లో నడయాడే ఆ పాపడికి అంతవరకూ పేరే పెట్టలేదు. ఒకరోజున బాలకృష్ణుడిలా బోసినవ్వు లాలకబోస్తున్న వాడినిచూసి ఆమె బాలకృష్ణా అని పిలిచింది. అంతే. అప్పటినుంచీ ఆ పేరే ఖాయమైపోయింది.

పదహారేళ్ళ వడుచు కమల మెట్రిక్ పరీక్ష ఇచ్చి అమ్మమ్మగారింటికి చూడటానికి వెళ్ళింది. అమ్మమ్మ తులిశమ్మ వేకువజామున లేచి పొరుగూరినించి తెచ్చిన పాలను ఆ ఊళ్ళో ఇంటింటికీ పోసి వచ్చేది. కొన్ని ఇళ్ళల్లో కూరగాయలు అమ్మి వచ్చేది. ఆ పూరి గుడిసెలో ఆమె జీవితం అట్లా గడించి పోతున్నది.

కమలకు నాలుగు రోజులు సెలవువచ్చినా తులశమ్మ దగ్గరికి వచ్చేది. ఎగురుతూ గంతులువేస్తూ ఆమెతోపాటు పాలుపోస్తూ-పాలెంనుంచి తెచ్చిన కూరగాయలు అమ్ముతూ కూడా కూడా తిరిగేది.

ఈసారి కమల తులశమ్మ దగ్గరికి వచ్చేసరికి మలకమంచం వీధివరెండాలో వేసి ఉంది. ఎవరో ఒకాయన తెల్లబట్టలు వేసుకున్నాడు. ఉద్యోగస్థుడేమో కూడా. మంచమ్మీద పడుకుని ఉన్నాడు. తులశమ్మ కాఫీచేసి తెచ్చి ఇస్తోంది ఆయనకు.

"బాబూగారూ. మీ జీపు వచ్చేవరకూ ఈ గ్లాసెడు కాఫీ పుచ్చుకోండి" వినయంతో మాటమాటకూ దణ్ణాలు పెడుతోంది.

"చూడు తులశమ్మా. ఇందాకా గ్లాసుతో మజ్జిగ ఇచ్చావు. ఇప్పుడు కాఫీ ఇస్తున్నావు. రాత్రికి కూడా మా జీపు రాకపోతే అన్నం కూడా పెడతావా?" గ్లాసందుకుంటూ అన్నాడు.

తులశమ్మ నవ్వింది. "నా పప్పుచారూ అన్నం మీరు తింటే ఎందుకు పెట్టను?"

సాయంత్రం ఆరు అయినా ఆఫీసరుగారి జీపు రాలేదు. అప్పుడడిగింది తులశమ్మ ఆయనను. "అయ్యా. మీను దేవూరు? ఏ పనిమీద ఎటుపోతున్నారు?" అని.

"నేను కొత్తగా ఈ ఉద్యోగంలోకి వచ్చాను. పల్లెసీమల్లో జనాభా తనిఖీ చేస్తున్నాను. ఒక సర్వేయరు గ్రామగ్రామం తిరిగి లెక్కలు తయారుచేస్తాడు. అతడి పై అధికారిని నేను. ఆ పల్లె దాటుతుండగా జీపు చెడిపోయింది. నేను కొంతదూరం నడిచి వచ్చాను. జీపును బండికి కట్టి బాగుచేయించటానికి తీసుకు వెళ్లాడు డ్రైవరు. బాగు కాగానే తీసుకువస్తాడు" వాకిట్లో తులశమ్మ వేసిన స్టూలు మీద కూర్చుని చెబుతున్నాడు కబుర్లు.

లోపల గోగుకాయలు గిల్లుతున్న కమల అతడినీ అతడు చెప్పే కబుర్లనూ బాగా కనిపెట్టి చూస్తోంది. ఆ మనిషీ- ఆ వాలకం- ఆ కబుర్లు చెప్పటం పట్టణపు నాగరీకత ఆమెను సుడిగుండంలో తిప్పేస్తున్నాయి. అతడిని తినేయాలన్నట్టుగా మిరుమిట్లుగొలిపే కళ్లతో చూస్తోంది.

పల్లెటూరి వాతావరణంలో పెరుగుతూ బస్సులో పొరుగూరు వెళ్లి చదువు తున్న కమలకు ఆ యువకుడు ఏ కిన్నెర కింపురుషుడిలానో కనిపిస్తున్నాడు.

ఏడుగంటలు కాగానే ఉన్న ఒక్క లాంతరు బాగా తుడిచి వెలిగించింది తులశమ్మ. మధ్యసావడి ఊడ్చి పీట వేసింది.

"అమ్మమ్మా. దీపం మసకగా ఉంది. నేను బాగా తుడుస్తాను" అంటూ కమల లాంతరు మళ్లీ బాగా తుడిచి వెలిగించింది. సావడి మళ్లీ ఊడ్చింది. పీట విస్తరి మంచనీళ్లచెంబు తనకు నచ్చినట్టు పెట్టింది. తులశమ్మ వడ్డిస్తుంటే తను తలుపు దగ్గరే నిలబడ్డది.

అతడు- అంటే పద్మనాభం కమల వంక- ఎవరో కొత్త పిల్ల అన్నట్టు చూసి- తరువాత పక్క చూపులు చూసి- ఆ తరువాత దొంగచూపులు చూసి- తులశమ్మ పెట్టిన అన్నం కడుపునిండా తిని వీధి వసారాలో పడుకున్నాడు.

తెల్లవారుఝామున నాలుగు గంటలకు జీపు వచ్చేటప్పటికి పద్మనాభానికీ కమలకూ మధ్య ముసిముసి నవ్వులల్లా పకపక నవ్వులయ్యాయి. మళ్లీ ఎప్పుడు వస్తారన్న ప్రశ్నకు "మళ్లా నెలకు ఇదేరోజున వస్తాను. తులశమ్మతో చెప్పు." అంటూ జీపు ఎక్కాడు పద్మనాభం.

కమల మళ్లీనెల అదేరోజు వరకూ చూసింది. ఆరాటంతో ఎదురుచూసింది. కళ్లు కాయలు కాచేటట్టు చూసింది. అతడు వస్తాడు. వచ్చి తనను పెళ్లి చేసుకుంటా డని బంగారు కలలు కంటూ ఎదురుచూసింది.

అతడు రాలేదు. కాని రాడు అనటానికి మనసొప్పలేదు.

తండ్రిచేత దెబ్బలు తిన్నది. తల్లిచేత అమ్మమ్మచేత తిట్లు తిన్నది. ఏ సంబంధం తెచ్చినా మెచ్చదు. ఎవరినీ కన్నెత్తి చూడదు. అంతలోనే అందరికీ సందేహాలూ అనుమానాలూ వచ్చాయి. మళ్లీ కమలను కొట్టారు, తిట్టారు. చివరకు తల్లీ తండ్రీ ఉన్న ఊళ్లో తల ఎత్తుకోలేక అమ్మమ్మ ఉన్న ఊళ్లో కమలకు పురుడు పోశారు. కమలను అక్కడే ఉంచారు. కమల తనకు పుట్టిన పిల్లవాడిని ఎవరికీ ఇవ్వవివ్వలేదు. తనే పెంచుకుంటానని హఠం చేసింది. లేకపోతే చస్తానంది.

తులశమ్మ చాటున పిల్లవాడు పెరిగాడు. ఆ ఊళ్లో భోజనంచేసి పక్క ఊళ్లో చదువుకున్నాడు. మెట్రిక్ ప్యాసు కాగానే తల్లీకొడుకు నగరం ప్రయాణమయ్యారు. తులశమ్మ చనిపోయింది. ఆ పూరిగుడిసె ఆ స్థలం అమ్మారు. ఆ డబ్బు చేతపట్టుకుని బయలుదేరారు.

కలిగిన వారెవరో రేకులషెడ్డు నాలుగు రూపాయలకు అద్దెకిస్తే దానికే గోనెపట్టాలు అడ్డం కట్టుకుని తల్లీకొడుకులు ఉన్నారు. స్కాలరుషిప్పు తెచ్చుకుని బి.ఎ. అయినదనిపించాడు బాలకృష్ణ.

కమల మోసపోయిందిగాని తెలివిగల ఘటంకావటంచేత ఇంటి యజమానులు తయారుచేసిన తినుబండారాలను సమీపంలో ఉన్న ఆడపిల్లల స్కూలులోను కాలేజిలోను అమ్ముకుని వచ్చేది. అమ్మగా వచ్చినదానిలో తనకు రోజుకు నాలుగు రూపాయలు ఇస్తే జాగ్రత్తగా ఇల్లు గడుపుకుని కొడుక్కు కావలసిన బట్టలూ అవీ అమర్చేది.

గడచిన ఇరవైసంవత్సరాలలో పద్మనాభాన్ని గురించి ఆమె కలలు కంటూనే ఉన్నది. తనను పెళ్లి చేసుకున్నట్టూ, కలిసి కాపురం చేస్తున్నట్టూ, పిల్లవాడిని అపురూపంగా చూసుకుని చదువు చెప్పిస్తున్నట్టూ పెద్ద ఉద్యోగం వేయించినట్టూ- స్వప్నాలు మధురమైనవి- మధురాతి మధురమైనవి కంటూనే ఉన్నది. అవును. ఆమె నవమాసాలు మోసి కన్నతల్లిగా కొడుకు భవిష్యాన్ని గురించి కాంక్షలు పెంచుకుంది అది తన సంతానానికి తండ్రి అయిన వాడి బాధ్యతగా ఆశించింది. కాని- సాక్ష్యాలు లేని మాతృత్వము తనదని మనసంగీకరించదు.

కాని- ఏదీ? ఏ కల నిజమయిందని?

ఒంటరిగా ఉన్నప్పుడు ఆమె తనలోతనే తల పంకిస్తూ నవ్వుకుంటుంది.

ఇటీవల కమల కమలమ్మయి పదిమంది పిల్లలకు చదువు చెప్పటం మొదలు పెట్టింది. ధరలు మిన్నంటిపోతున్నాయి. కన్నబిడ్డకు కడుపునిండా అన్నమైనా పెట్టాలని ఆదుర్దా.

"అమ్మా. నాన్న ఇప్పటివరకూ ఉంటే నాకు వెంటనే ఉద్యోగం దొరికేది కదూ?" బాలకృష్ణ బాల్యము వీడనట్టే అడుగుతాడు తల్లిని.

"అవునురా. ఆయనే ఉంటే నీవిట్లా ఉంటావా బాలూ! ఎంత పెద్ద చదువు? ఎంత పెద్ద ఉద్యోగం? ఎంత అదృష్టం పట్టేదో? ఏదీ నీవు కళ్లు తెరిచే సరికి ఆయనకు చూసే యోగం లేకుండా పోయింది."

"దురదృష్టవంతుణ్ణి కదూ అమ్మా?" అంటాడు.

ఆమె అవునని బైటికి అనదు.

"అమ్మా. వాసు దగ్గరికి ఒకసారి వెళ్లివస్తాను" గుమ్మం దాటాడు బాలూ.

వీధి మొదట్లోనే వాసు కలిశాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ రామస్వామి దగ్గరికి వెళ్లారు. రామస్వామి వీళ్లతో చదివినవాడేగాని నాలుగేళ్ల సీనియరు.

అందరూ కలిసి మ్యునిసిపల్ పార్కులో కూర్చున్నారు.

రామస్వామి ముఖం చాలా దీనంగా ఉంది.

"ఏమిటి? నీ ముఖం చాలా విచారంగా కనబడుతోంది. అంత బాధపడి పోతున్నావేమిటి రామస్వామి?" వాసు బాలూ ఇద్దరూ ఒక్కసారే అడిగారు.

"నా దురదృష్టానికి నేను విచారపడుతున్నాను. పద్మనాభంగారనే ఆఫీసరు తన ఆఫీసులో అటెండరు ఉద్యోగం నాకిస్తానని మా నాన్నతో చెప్పి - ఆశపెట్టి పెట్టి ఇవాళ వెళ్లి అడిగితే ఎవరికో ఇచ్చేశానన్నాడు. తరువాత తెలిసింది రెండు వేలు తీసుకున్నాడట ఆ ఉద్యోగమిచ్చినందుకు. వాడెవడోకాదు - మన క్లాసుమేట్ శివప్రసాద్" ఆవేశపడిపోతున్నాడు రామస్వామి.

"ఇది ఒకచేనా? ఇంకెక్కడా ఉద్యోగాలు మనకు దొరకవా?" వాసూ బాలూ అతడిని శాంతపరచటానికి ప్రయత్నించారు.

"ఆయన కొడుకట పై చదువులకు ఎక్కడికో వెళ్తాడట అందుకని ఆఫీసులోఉన్న చిన్నచిన్న పోస్టులన్నీ ఇలా అమ్మేస్తున్నాడట" రామస్వామి కళ్లల్లో ఎర్ర జీరలు.

ముగ్గురూ చాలా సేపు ఆఫీసరును గురించి మాట్లాడుకుని ఇళ్లకు వెళ్లారు

ఆశాభంగంతో ముఖం చిన్నబుచ్చుకున్న కమలమ్మ కొడుకు రాగానే భోజనం పెట్టింది.

పడుకోబోయేటప్పుడు మాట్లాడుకోవటంలో మళ్లీ ఉద్యోగ ప్రసక్తి వచ్చింది. తను విన్నాదంతా చెప్పాడు బాలు.

స్కూల్లోకి తినుబండారాలు తీసుకువెళ్లే కమలమ్మంటే శశికి ఎంతో ఇష్టం. కమలమ్మ మాట్లాడుతుంటే ఆ అమ్మాయికి గుండెలో సంతోషం పొంగుకుంటూ వస్తుంది. ఆ అమ్మాయిని చూస్తే కమలమ్మకు పద్మనాభాన్ని చూసినట్టుంటుంది. అందరికంటె ఆ అమ్మాయికి ప్రత్యేకంగా టిఫిన్ పళ్లెంలో నింపియిస్తుంది.

పండగనాడు కమలమ్మను ప్రత్యేకంగా ఇంటికి పిలిచింది శశి. తల్లిని పిలిచి కమలమ్మను చూపించింది.

"అక్కడి టిఫిన్లు అలవాటయి ఇంట్లో ఏది చేసినా శశి వాటి మాదిరిగా ఉండవని తినటం మానేసింది" తల్లి చెప్పింది.

"నేను కాదమ్మా చేసేది. నేను మధ్యవర్తిదే" అన్నది కమలమ్మ ముఖ మాటపడుతూ.

కమలమ్మ చాలా సేపు కూర్చుంది. శశి తన అక్కలిద్దరిని తీసుకువచ్చి చూపించింది. అన్నను కూడా పిలుచుకువచ్చింది.

"ఈ ఆంటీ మాకు మంచి మంచి టిఫిన్లు తెచ్చిపెడుతుంది మధ్యాహ్నం వేళ. ఎంత రుచిగా ఉంటాయో తెలుసా?" గొప్పగా చెబుతోంది శశి.

తన పెద్దపెద్ద కళ్లను మరింత విశాలం చేసుకుని చూసింది కమలమ్మ. చూపులు తిప్పుకోలేకపోయింది. రెప్పలు వాలలేదు.

అణువంతయినా భేదంలేకుండా ఇంతగా ఒకరినొకరు పోలి ఉంటారా మనుష్యులు? తాను ఆ యింట్లో - అతడిని చూసింది కనక సరిపోయింది. మరెక్కడయినా చూసినట్లయితే 'బాలూ' అని పిలిచి ఉండేది.

కొంత సేపటికిగాని ఆమెకు తనెక్కడున్నదీ తెలియలేదు. తెలిసిన తరువాత మరింక అక్కడ ఉండటం భావ్యం కాదనిపించి లేచింది.

"ఈ శశి అంటే నాకెంతో ప్రేమ. అందుకే పిలవగానే ఇంటికి వచ్చాను. వెళ్తాను" అంటూ లేచింది కమలమ్మ.

"మీ బాబుకియ్యండి" శశి తల్లి కొబ్బరిమిఠాయి పొట్లం కట్టి ఇచ్చింది.

చెయ్యెత్తి దణ్ణం పెట్టబోతున్న కమలమ్మ అక్కడికి వచ్చినాయనను చూసి ఒకడుగు వెనక్కువేసింది.

పద్మనాభం లావెక్కలేదు. తులశమ్మ యింటికి వచ్చినప్పుడు ఎట్లా ఉన్నాడో ఇప్పుడూ అట్లాగే ఉన్నాడు. పెద్ద ఉద్యోగమయిందేమో మరింత హుందాగా ఉన్నాడు. భార్యను పర్సు ఇవ్వమని అడుగుతూ కమలమ్మను తేరి పారజూస్తున్నాడు.

"ఈమే నాన్నా, మాకు టిఫిన్లు తెస్తుంది స్కూలుకు" అంటూ శశి కమలమ్మను పరిచయం చేసింది.

"మీరు చేసేపని చాలా బాగుందమ్మా. ఈ పిల్లలు ఈగలు ముసిరే సరుకులు కొనుక్కుని తిన్నదానికంటె మీరు ఇంట్లో చేసినవి జాగ్రత్తగా కాగితాలలో చుట్టి ఇస్తున్నారట" ఇంకా ఆమె కళ్లల్లోకి చూస్తున్నాడు.

"స్కూలుకు దగ్గర్లోనే ఉంటారా?" మళ్లీ ప్రశ్నించాడు.

ఆమె కళ్లనిండా ఆయనను చూసింది. గుచ్చిగుచ్చి చూసింది. జ్ఞాపకం తెచ్చుకో అన్నట్టు చూసింది. మగవాడెంతలో మరిచిపోతాడో అన్న విరక్తిభావంతో చూసింది.

“కూర్చోండి. నిలబడే ఉన్నారు” భార్యకోసం ఎదురుచూస్తున్నాడు. ఆమె తాళపుచెవుల కోసం వెతుకుతోంది. అవి కనబడకపోతే పిల్లలను చివాట్లేస్తున్నది.

“నాన్నా మీకోసం ఎవరో అబ్బాయి వచ్చాడు” కొడుకు వచ్చి చెప్పాడు.

“ఈ ఉద్యోగాల కోసం వచ్చే అబ్బాయిలతో మతిపోతోంది” విసుక్కున్నాడు పద్మనాభం.

“ఇదిగో మీ పర్సు. మళ్లీ ఎవరో వచ్చారటగా మీ కోసం? వచ్చిన వాళ్లను ఏవో రెండు మాటలు చెప్పి పంపక- కన్నకొడుకును కూర్చోబెట్టుకున్నట్టు కూర్చోబెట్టుకుని కష్టసుఖాలడుగుతుంటే ఆఫీసుకూ వస్తారు ఇంటికీ వస్తారు.”

తన ప్రజ్ఞకూ భార్య ఇచ్చిన కామెంట్‌కూ ఉబ్బిపోయాడు పద్మనాభం.

“కబుర్లు చెప్పినంతమాత్రాన అందరూ కొడుకులవుతారా? కన్నకొడుకులయినా కొడుకులనిపించుకోరు. నేనెరిగిన ఒకాయన పాంథుడిగా ఒక ఊరికి వచ్చి బిడ్డ తండ్రి అయినాడు. ఆ బిడ్డ పెద్దవాడయి ఆ తండ్రి దగ్గరికే ఉద్యోగానికి వెళ్లవలసి వచ్చింది. అప్లికేషన్‌లో పిల్లవాడి తండ్రిపేరు కూడా ఉంది. ఉంటేనేమి? ఆయనకెట్లా తెలుస్తుందీ సంగతి? ఏవో నాలుగు కబుర్లు చెప్పి పంపించాడు.” కమలమ్మ జనసామాన్యం సంగతి చెప్పినట్టుగా చెప్పింది.

“అవున్లెండి. పాంథుడిగా ఒక పూటో అర పూటో ఉన్నవాడికి కొడుకు పుట్టాడని ఎట్లా తెలుస్తుంది? అయినా టూర్ ప్రోగ్రాం వేసుకుని బయలుదేరిన వాడికి ఎన్ని ఊళ్లో తగులాయి. ఎన్నని జ్ఞాపకం ఉంచుకోగలుగుతాడు?” పర్సు జేబులో పెట్టుకుంటూ గడ్డం తడుముకుంటూ “రాత్రికి కాకుండా సాయంత్రం ఆటకే పిల్లలను సినెమాకు పంపు” అన్నాడు భార్యతో.

“పాంథుడు.... ....పాంథుడికేం బాధ్యతలుంటాయి? ఏం జ్ఞాపకాలు ఉంటాయి?” గొణుక్కుంటూ అడుగులు వేసింది కమలమ్మ వీధిలోకి. “క్యాంపులు తిరిగే వాళ్లకు ఎన్నో ఊళ్లు తగులుతాయి. ఎన్నెన్ని జ్ఞాపకం ఉంచుకుంటాడు?” ఆ మాటలే తలలో తిరుగుతున్నాయి.

“తండ్రి ఒకటే అయినా హోదాలు వేరు కనుక ఒకడికి తండ్రి-ఒకడికి పాంథుడూ అవుతాడు”. కమలమ్మకు అందరికీ తెలిసిన ఈ సత్యము ఆలస్యముగా తెలిసింది.